కథానిక

# ఏకోదరుడు

యన్. ఆర్. నంది

ఎలానూ వొచ్చేటప్పుడు ఆ గ్రామం మీంచే తిరిగి వొస్తాడుగాబట్టి, మను, తన చిన్న చెల్లెలు ఆ గ్రామంలో వుంది ఓసారి చూసి రమ్మంటే సీతారామయ్య పద్మని చూసివచ్చాడు. ఎవరా గ్రామంకేసి వెళ్ళినా మను అలానే చెబుతుంటాడు. వాళ్లూ అలానే ఆమె యోగ క్షేమాలు కనుగొని చెబుతూంటే మను ఎంతో పొంగిపోయేవాడు. కాని యిప్పుడు సీతారామయ్య దగ్గరనించి ఆ కబురు వ్యతిరేకంగా రాగానే, ఆ విషయాన్ని నమ్మాలో నమ్మగూడదో అనే సందిగ్ధావస్థలో పడిపోయాడు.

"ఎంచెంచి భలే సంబంధం చేశావురా" అని సీతారామయ్య నిట్టూర్పు విడచి అనగానే మను మనసు బెదిరిపోయింది.

"ఏం తాతయ్యా?" అని కంగారుగా ప్రశ్నించాడు.

"ఇక ఏమంటే ఏం చెప్పాలి? రాక్షసుల చేతుల్లో పడేశావు బంగారంలాంటి పిల్లని. దాన్ని వేపుక తినేస్తున్నారు. నిలబడితే తప్పు, కూచుంటే తప్పు, కనిపిస్తే తప్పు, కనిపించకపోతే తప్పు. విధవప్ప చెల్లెలు, కామాక్షమ్మ, మాట వింటూ జగ్గ గూడ దాన్ని చంపేస్తున్నాడు. దాని వొంటిమీద కర్ర విరగని రోజంటూ లేదు."

సీతారామయ్య అత్తారింట్లో చెల్లెలు పడుతున్న బాధలు చెబుతూంటే, మను, నిజంగా అలా జరుగుతుందా అని ఆశ్చర్యపోయాడు. అంత చదువు చదువుకొన్నాడు వాడికెందుకు బుద్ధిలేదు? కామాక్షి మాటలు వింటూ, పద్మని చావుదెబ్బలు కొట్టడమేం?.

"ఆ కామక్షమ్మంది చూశావూ, అమ్మమ్మ ఎంత నోర్రా ఆవిడిది! నే నిలా గుమ్మంలో అడుగు పెట్టేసరికల్లా 'పుట్టింటి చుట్టాలకిక చూసుకో ఎంతలేసి అల్లేస్తుందో' అని బయట వున్న జగ్గతో నూటిగా అంది. నా కామె మాటలు అర్థంకాలేదు. లోపలి కెళ్ళాను.

"నిజంగా పద్మని చూసి ఆశ్చర్యపోయాననుకో. సన్నగా చీపురుపుల్లలా అయిపోయింది. బుగ్గలన్నీ తీసిపోయి, ఏ పదిమంది బిడ్డల తల్లిలాగో అగుపిస్తోంది. తల కసలు నూనెన్నా ఇస్తారో ఇవ్వరో. నన్ను చూడగానే ఒక్కసారిగా బావురుమంది. ఆ ఏడుపు ఏడవడానికన్నా శక్తిలేదు. నేనెంత ఓదార్చినా దాని ఏడ్పు తగ్గలేదు. 'అన్నయ్య నొక్కసారి రమ్మను తాతయ్యా' అని ఏవందసార్లు చెప్పిందో ఆ కాస్తసేపులోను.

"ఆతర్వాత కామాక్షమ్మ రావడమూ, ఇక జరగవలసిందంతా జరిగిందనుకో-కాని ఎంతెంత ఎంచి ఆ సంబంధాన్ని చేశావోగాని, నీప్రయత్నానికే మెచ్చుకోవాలిరా" అని చివరనన్న సీతారామయ్య వ్యంగ్య వాక్యానికి మను దుఃఖంతోబాటు పరాభవంతో కృంగిపోయాడు.

కళ్లల్లో నీళ్లు గిరగిర తిరిగిపోయాయి. పదహారేళ్ల పసిదాన్ని, ముట్టుకుంటే కందిపోయే పాల బుగ్గలని అలా హింసించడానికి వాళ్లకి చేతులెలా వస్తున్నాయో!

తను ఛాతీమీద వేసుకొని అల్లారుముద్దుగా పెంచిన చిన్నచెల్లిని! తను ముద్దులాడితే కిల కిలమనే చిట్టిపద్మని ఆ కిరాతకులు చిత్రవధ చేసేస్తున్నారా? ఆ ఉద్వేగంలో పళ్లు పటపట కొరుకుతున్నాడు.

కాని సీతారామయ్య చెప్పిన ఈ మాటలు నిజాలేనా, లేక కల్పించినవా? కల్పించే వరకూ అతని కేంపట్టింది? పోనీ జగ్గ అతనికి విరోధా అంటే అదీకాదు. మరి? అతను చెప్పేవన్నీ నిజమేనా?

నిజమయితే, పద్మకి చదువొచ్చును గదా ఇలా అని ఒక ఉత్తరం ముక్కైనా రాయదా?

ఏమో ఆ క్రూరులు దాన్ని నిర్బంధిస్తున్నారేమో?

అమ్మ చనిపోయేప్పుడు మరీమరీ 'ఇద్దరు చెల్లెళ్లని నీ ప్రాణంలా చూసుకో నాయనా' అని చెప్పి ప్రాణం విడిచింది. కాని తను చేసిన పనేమిటి? అలాంటి రాక్షసి కొంపలో తన చిన్న చెల్లెల్ని చేజేతులా తోసిన పాపి తనే అని, మను తన్ని తానే ఎంతో నిందించుకొన్నాడు. చెల్లెలి కష్టాలన్నిటికీ తనే మూలమని కత్తితో పొడుచుకొని ఆత్మహత్య చేసేసుకోవాలనుకొన్నాడు.

జగ్గ అలాంటివాడు కాడే! మరి వాడే చెల్లెల్ని అలా చంపుతున్నాడట- ఆ విధవ చెప్పుడుమాటలు విని, అవును కామాక్షి మాటలు విన్న ప్రతివాడు అలానే మారిపోతాడు. ఆ వేళ పెళ్లిలో కట్నం గురించి మామ ఏమీ అనకపోయినా ఆడవి 'కట్నంలో ఒక్క పైసా తక్కువైతే పెళ్ళి పీటలమీదే ఆపుచేయింపబడుతుంద'దని ఝుడాయించినప్పుడు గూడ మను దాని నిజతత్వాన్ని వూహించలేకపోయాడు.

"ఇక ఎక్కువ ఆలస్యం చేయకు. త్వరగా వెళ్ళి పద్మని తీసుకొచ్చేయ్; కొన్నాళ్లు పోయింతర్వాత మళ్ళా పంపుదువుగాని. ఇక అదక్కడలా మరికొంతకాలం వుందా గింజుకొంటూ చస్తుంది. నీకు దక్కదు" సీతారామయ్య చివరి సలహా ఇచ్చి ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

మను కోపంతో దహించుకపోయాడు. చిన్న చెల్లెలికి సరిగా తిండిపెట్టకండా కడుపు మాడుస్తున్నారా? ఇక్కడుంటే చెల్లెలికి పరమాన్నాలతో, పాలు, పాయసాలతో తినిపించేవాడు. ఆ చెల్లే అత్తారింటికి వెళ్లబోయే సరికి పట్టెడు తెల్లటన్నమైనా కళ్లనిండా చూట్టానికినోచుకోలేదు.

ఇంతగా హింసించేవాళ్ళు, దానికి రాత్రిళ్లు పడుకోడానికి మంచమిస్తారేమిటి? తను కొనిచ్చిన చీరనే పరచుకొని ఆ వొత్తి నేలమీద పడుకొంటుంది. ఇక్కడైతే తను చెల్లెలిని మెత్తని దూదిపరుపుమీద పడుకోబెట్టుకొనేవాడు. ఇవన్నీ తలుపుకి రాగానే 'చెల్లీ, ఎంత బాధపడుతున్నావో' అన భళ్లున ఏడ్చేశాడు మను.

కడుపులోని దుఃఖం కళ్ళపెళ్ళమని పైకి జ్వాలాముఖి ముఖంనించి ద్రవ ఉల్లేపంలా ఎగిరిపడగానే, మను ఇహ సీతారామయ్య ఇంట్లో నిలబడలేక పోయాడు. గిర్రున తిరిగి తనింటికి పరుగెత్తుక వచ్చి తలుపు గభుక్కున తెరచాడు.

తలుపు తెరవగానే ఎదురుగా గోడకి తగిలించివున్న కసాయికత్తి అగుపించింది. ఆ పక్కన తన చిన్నచెల్లెలు తలపట్టుకొని నేలమీద బరబరా యీడ్చేస్తున్న కామాక్షమ్మ అగుపించింది. ఆ దృశ్యాన్ని చూడగానే మను పెద్దకేకవేసి, పరుగునవెళ్లి కామాక్షి తలపట్టుకొని గోడనున్న కత్తిని తీసి శక్తికొద్దీ దాని పీకనరికి చేతితో పైకెత్తాడు.

కిందన చెల్లెలు మూర్ఛపడివుంది. చెల్లెలి అవస్థని చూడగానే మను కడుపు తరుక్కుపోయింది. వెంటనే చెల్లెలిమీద పడి చిన్నపిల్లాడిలా ఏడ్చేశాడు.

హృదయోద్వేగం కాస్తస్థిమితపడింతర్వాత, మను పైకి లేచి చూసుకొన్నాడు. తన ఆలింగనంలో వున్నది చెల్లెలు కాదు, చెల్లెలింతకముందు పడుకొనే దూదిపరుపు; చేతిలోవున్నది కామాక్షి తల కాదు, తలగడ.

మను కళ్ళు నులుపుకొన్నాడు. కింద ఎవరూ లేరు. చేతికి రక్తంలేదు, తల లేదు. వెంటనే సీతారామయ్య అన్నమాటలు చెవుల్లో గింగురుమన్నాయి.

మను గబగబా పెద్దచెల్లెలు, దుర్గకి ఒక ఉత్తరం రాసి, మొలన కత్తిపెట్టుకొని స్టేషన్‌కి వెళ్ళాడు.

బండి కొవ్వూరు చేరుకొనేసరికి ఎనిమిదన్నర అయింది. అక్కడినించి చెల్లెలి గ్రామం పదిహేను మైళ్లు. ఒక కంకరరోడ్డు, ఒక అడివినించి కాలిబాట వున్నై. బండి దిగి ఆ చీకటి రాత్రిలో కంకరబాటమీంచి పరుగునే వెడుతున్నాడు మను.

కంకరరోడ్డు విడిపోయింది. పొదలనించి, ముళ్ళకంచెలనించి పోతున్నది దారిప్పుడు. అయినా అవిఅతన్ని బాధించడంలేదు. గుండెలు కమిలి పోతున్నా పరుగులో వేగాన్ని మాత్రం తగ్గించడంలేదు. ఇప్పుడు అడివి. కాలిబాట

మీద, నక్షత్ర హీనకాంతిలో పరుగు తీస్తున్నాడు.

చివరకి పదిన్నరకి ఆ గ్రామాన్ని చేరుకొన్నాడు. గ్రామపొలిమేర దగ్గర గూడ ఆగలేదు. ఇంటిముందుగూడ నిలబడలేదు. తిన్నగా వంటవసారాలో ఆగాడు. అక్కడంతా వెదికాడు. అక్కడ చెల్లెలు లేదు. కేక వేయడానికన్నా మాటరావడం లేదు. దొడ్లోకి వెళ్లాడు. అక్కడా లేదు. ఇప్పుడు మెల్లగా కేకేశాడు సమాధానం లేదు.

ఇంట్లోకి వచ్చాడు తిరిగి. అక్కడ దాసీది ఇల్లు కడుగుతోంది. మను గబగబా వెళ్లి దూకుడుగా ఆ దాసీతల పట్టుకొని పైకెత్తాడు. ఒక మూల మసగగా వున్న కిరసనాయిల్ దీపపు కాంతిలో, మను ముఖం చమటతో మణుల మధ్య బుసలుకొడుతున్న నాగుబాములా అగుపించగానే ఆ దాసీది "అన్నయ్యా" అని కడుగుతున్న చీపురుని, చెంబుని వొదిలి మనుని ఒక్కసారిగా గట్టిగా కౌగిలించుకొని భోరుమంది.

"చెల్లీ"—అన్నయ్యా అనే మాట వినిపించగానే అప్రయత్నంగా "చెల్లీ" అన్నాడు గాని, తన కౌగిలిలోని దాసీదే తన చిన్న చెల్లెలని మను గుర్తించలేకపోయాడు.

"అన్నయ్యా"—చిన్నతనంనించి అల్లారు ముద్దుగా పెరిగిన అన్న ఛాతీమీద ముఖాన్ని దాచుకొని ఏడుస్తోందామె. మను అప్పుడామెకేసి చూశాడు.

"ఏడవకమ్మా, చెల్లీ" అన్నాడు తల నిమురుతూ.

"అన్నయా వొచ్చావా...న న్నక్కడికి తీసుకపో. నే నిక్కడుండను. నన్ను చంపేస్తున్నారు. నన్ను తీసుకపో అన్నయ్యా."

ఒక లోతుగుండెగల గృహిణి, అత్తారింట్లో తనకెకలిగే కష్టాలని, పుట్టింటివా రెవరైనా ఒకరు వచ్చినప్పుడు, అంతత్వరగా వెలిబుచ్చదు. కాని పదహారేళ్ళ పసిబాల, తన తండ్రిలా, తల్లిలా పోషించి పెద్దచేసి, పెళ్ళిచేసిన అన్నయ్యని చూడగానే, తన బాధల నన్నిటినీ ఒక్కసారిగా చెప్పి భోరుమంది.

భయంతో బెగిలిపోయినట్లు తన్ని గట్టిగా పట్టుకొన్న చిన్న చెల్లెలిని, మను బిగువుగా బాహువుల్లో బంధించి "భయం లేదమ్మా. ఊరుకో" అని ధైర్యం చెప్పాడు.

"అన్నయ్యా, న న్నిక్కడికిక పంపించకు. నీదగ్గరే వుండిపోతాను. నాకు అన్నం పెట్టరు. సరిగా రాత్రి పన్నెండయేవరకూ పడుకో నివ్వరు. అతనుగూడ నన్ను గట్టిగా రక్తాలు కారేట్టు కొట్టేస్తుంటాడు. అన్నయ్యా, నన్ను నీతో తీసుకపో అన్నయ్యా" అని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

స్త్రీ భాగంలో భర్తనుండే ప్రాముఖ్యమేమిటో అన్న చేతుల్లో అల్లారు ముద్దుగా పెరిగిన పసి పద్మకి తెలీదు.

"నేనుండగా నీకు భయమేమిటమ్మా? ఏడవకు చెల్లీ. లేలే అలా ఏడవ్వచ్చా? చెల్లీ, అదుగో యింకా ఏడుస్తున్నావ్? ఊరుకోమ్మా?"

"వొద్దన్నయ్యా. ఆవిడవొచ్చిందంటె నిన్ను గూడ తిడుతుంది నడు వెళ్లిపోదాం. అన్నయ్యా యిప్పుడే వచ్చేస్తుంది."

"అది నన్నేం చెయ్యలేదమ్మా. ఏమన్నా అంటే ఆ ముండని నరికి వొదిలి పెడతాను."

"వొద్దన్నయ్యా. దానిదగ్గర పెద్ద రోకలుంది. త్వరగా వెళ్ళిపోదాం రా, అన్నయ్యా"

"ఉఫ్! ఎంత పిరికిదానివే? నిన్ను కొడుతుందని నన్నూ కొడుతుందా? నామీదికి వస్తే దాని కాలుకొక్కలు, కీలుక్కలు తీసి పారెయ్యనూ" అంటూండగానే కామాక్షమ్మ వచ్చింది.

"ఓస్! మొనగాడు! నాయింటికొచ్చి నన్నే చంపుతావ్" గట్టిగా అరచింది.

"నోర్ముయ్. మళ్ళా నోరెత్తావా నరికేస్తాను" గర్జించాడు మను.

"ఛీ, సొంజారి వెధవ. నోరెత్తావంటే ముందుగా ఈ గడపకి బలిచ్చేస్తాను-" ఆ మాటలింకా కామాక్షి నోట్లోనే వున్నాయ్, మను ఆవిడమీదికి అమాంతంగాదూకి, జుత్తుపట్టుకొని రెండుగుద్దులతో గోడ కాన్చేశాడు. గోలవిని జగ్గ, జగ్గ తండ్రి జగన్నాథం పరుగున లోపలికి వచ్చారు.

రుద్రాకారంలో వున్న మనుని చూడగానే జగ్గ భయపడ్డాడు. జగన్నాథం ఏమీ మాటాడ లేదు–అతనికి కూతురు సంగతి తెలుసు.

భయపడుతూనే జగ్గ మను దగ్గరికివచ్చాడు. "ఏఐ య్యేవిట్రా?" అన్నాడు, వొణుకుతూ.

"నోర్ముయ్—" ఒక్క గుద్దుతో జగ్గడు తండ్రి ఒళ్ళో పడిపోయాడు.

పడిపోయిన జగ్గని, మను గబగబా వెళ్ళి చొక్కాపట్టుకొని పైకెత్తి మరి నాలుగుగుద్దులు గుద్దేసరికి జగ్గ ముక్కునించి రక్తం చిమ్మింది.

రక్తాన్ని చూడగానే పద్మ కళ్లు తిరిగి పోయాయి. గబుక్కున అన్న చేతులు పట్టేసు కొంది.

"అతనిదేవీం తప్పు లేదన్నయ్యా. అంతా ఈమే చేసేది. నాకు అన్నంగూడ ఈమే పెట్టేది కాదు. బలంలేక ఇల్లు కడగకపోతే అతనికి పుల్లెక్కించి చేతికి కర్రందించేది—"అని అన్నకి, కామాక్షిమీద చెప్పింది పద్మ.

ఆయాసంగా రొప్పుకొంటూ లేచింది కామాక్షి. రెండు గుద్దులతోనే దాని పసంతా వూడిపోయింది.

"నేనే... నేనే, నీకు అన్నం పెట్టేదాన్ని కాదు? అమ్మ ఎంతకన్నా తగుదువే చిత్రాంగి! ఓర్పెత్తగానే గబగబా కుండదగ్గరే బుక్కేసేది. అమ్మ బాబో! ఆ లుచ్ఛారాగానే ఎన్నెన్ని పుట్టించి చెబుతోందో" అని గుండెలు బాదు కొంటోంది.

"కామాక్షమ్మా నువ్వూరుకో" అని జగన్నాథం మను దగ్గరకివచ్చి "నీకేం కావాలయ్యా?" అన్నాడు.

"ఏం కావాలి? దాన్ని చంపి మరి పోతాను. నాయింట్లో డబ్బులేక నాచెల్లెల్ని నీ యింట్లో అంటు మెతుకులికి పంపించానా? నాయింట్లో పరుపులేక నీ యింట్లో వొత్తి నేలమీద పడు కోడానికి పంపించానా? నీకు యిల్లు కడగడానికి దాసీల్లేరని నేను పంపించానా—"

"మరెందుకురా, కొజ్జా, పంపించింది. మా నెత్తెక్కడానికా?" అని అరచింది కామాక్షి.

"నోర్ముయ్. నడుం జారిపోగలదు" అని మీదకి ఉరకబోయాడు మను.

"ఏం మెల్లమెల్లగా అడుగుతున్నానని మరీ మరీ నిగుడుతున్నావ్? మాటలు సరిగ్గా రానియ్" అని అడ్డాడు జగన్నాథం.

"ఆడదాన్ని అదుపులో పెట్టలేక నువ్వూ."

"నోర్ముయ్. నా యింటికొచ్చి నాకే బుద్ధి చెప్పా..."

"అన్నయ్యా, అన్నయ్యా వూరుకో మామయ్య మంచివాడు. అతన్నేమీ అనకురా—" అని మనుని పద్మఆపింది.

"నువ్వు ఆపకపోతే యింతోటి మొనగాడు మా ప్రాణం తీసేస్తాడేవిఁటే ముండా—" అంటూ కామాక్షి పద్మమీదికి రాబోయింది.

ఆ చేత్తోనే మను, ఎలకపిల్లని విసరేసినట్టు, కామాక్షిని విసరేశాడు.

కిందపడ్డ కామాక్షి, మనుని నానామాటలు ఆడింది. మను సహించలేనన్ని తిట్లు తిట్టింది. మను పళ్లు పటపట కొరుకుతున్నాడు. ఆమె రంకె లేసేకొద్దీ మను ఉద్రేకించిపోయాడు. ఎంత గయ్యాళిదైనా స్వంత కూతురేగా, అందువల్ల జగన్నాథంగూడ మనుని ఏవేవో అన్నాడు.

ఇక మను ఆ తిట్లని, మాటలని సహించలేనంత కోపిష్టి అయిపోయాడు. ఒకపక్క ప్రేమతో పెంచిన చిన్న చెల్లెలు బాధలు, రెండోపక్క గయ్యాళిదాని తిట్లు. మను సింహంలా గర్జించాడు. వెంటనే మొలలోని కత్తి చేతుల్లో చిందులు దొక్కి రక్తంతో ఎర్రబడిపోయింది.

ఖూనీ, ఖూనీ అని ఆ రాత్రి గ్రామమంతా గగ్గోలు పెట్టేసింది.

*  *  *

తొలికోడి కూసింది. తెల్లవారింది, మధ్యాహ్నంగూడ అయిపోయింది. జగ్గని చంపి నదిలోపడి మను ఆత్మహత్య చేసేసుకొన్నాడని పెద్దచెల్లెలు దుర్గకి తెలీగానే, ఆమె నిలువునా కూలిపోయింది. మరిది హత్యచేయబడి చెల్లెలు విధవ ఐపోయినా, ఆ వార్త దుర్గని అంతగా కదలించలేదుగాని, అన్నయ్య ఆత్మహత్య చేసుకొన్నాడనగానే ఆమె భయంతో వొణికి పోయింది.

ఆమెకి ప్రపంచమంతా ఒక్కసారిగా పేలిపోయినట్టయిపోయింది. వాడు అన్నంత పనీ చేసేస్తాడు. వాడు తమని ఎంతగా ప్రేమి

స్తాడో, తమ కేవన్నా చిన్న కష్టం కలిగిందంటే అంత కోపిష్టి ఐపోతాడు. చిన్న చెల్లెలు ఆడపడుచు సాధింపుల్లో చచ్చిపోతోందని దుర్గకి కొంచెంగా తెలిసింది. కాని ఆ వార్తని అన్నకి మాత్రం తెలియనివ్వలేదు, తెలిస్తే వాడిక అగ్గయిపోతాడని.

తీరా వాడికి తెలీనే తెలిసింది, తను అనుకొన్నంతపనీ చేసేశాడు. నిజంగా అలా చేసుంటాడా? జగ్గని చంపి, పద్మని యావజ్జీవితం విధవగానే వుంచడానికి తలపెడతాడా? ఈ కబురు అబద్ధమేమో! అని దుర్గ అనుకొంటుండగానే నిన్న మను రాసిన ఉత్తరం వచ్చింది.

కంగారుగా దుర్గ ఉత్తరాన్ని చదువుకొంది.

“చెల్లీ,

చిన్న చెల్లిని వాళ్లు నానాబాధలు పెడుతున్నారట. అన్నంగూడ సరిగా పెట్టకట సరిగదా రోజూ దాన్ని చింతరువ్వలతో బాదుతుంటారట. ఈ పదహారేళ్ళలో దాన్ని నేనెప్పుడూ చేయెత్తి కొట్టలేదు. అలాంటిది వాళ్లు రోజూ దాన్ని చావుదెబ్బలు కొడుతుంటారట. ఇప్పుడే నేను చిన్న చెల్లెలు దగ్గరికి బయలుదేరి వెడుతున్నాను. దానికోసం నా ప్రాణాన్ని గూడ యిచ్చేస్తాను. —మను అన్నయ్య,”

ఉత్తరంలో అక్షరాలు ఒక్క ముక్కగూడ గుర్తుపట్టలేనంత అస్పష్టంగా వున్నాయ్. గబగబా రాయడంవల్ల అక్షరాల పోలికే దొరకడం లేదు. ఐనా దుర్గ ఎంతో ప్రయాసతో విడదీసి చదివింది. వచ్చిన కబురుకి, అందిన ఉత్తరానికి ఏమీ తేడాలేదు. ఐతే నిజంగా అన్నయ్య అక్కడికి వెళ్ళాడా? జగ్గని ఖూనీచేసి నదిలో పడిపోయాడా? అని దుర్గ ఒక్కసారిగా ఏడ్చేసింది.

ఆమె ఏడ్పుకి యింట్లో వాళ్ళందరూ పరుగున వచ్చేశారు. కాని అసలు సంగతి ఎవరూ ఆమెనించి తెలుసుకోలేక పోతున్నారు. ఎంత మంది ఓదారుస్తున్నా దుర్గ ఏడుపుమాత్రం తగ్గడంలేదు.

దుర్గ భర్త ఆమె చేతిలోని ఉత్తరాన్ని తీసి చదివాడు. దీనిలో అంతగా విచారించవలసినంత విషయ యేమీలేదు. చిన్న చెల్లెలంటె దుర్గకి ప్రాణమని తెలుసు, అది అక్కడ కష్టాలు పడుతున్నట్టు అన్న రాయగానే, ఏడ్చిందేమోనని ఊహించాడు.

“పద్మని ఆ యింట్లో వేస్తారంటేనే వొద్దన్నాను. కామాక్షి సంగతి నాకు బాగా తెలుసు. అది మొగుణ్ణే గడగడ లాడించేది. వాడు చచ్చిం తర్వాతగూడి దాని పొగరు, గయ్యాళితనం తగ్గలేదు” అన్నాడు.

“అయినా ఈ మనిషికి ఏం బుద్ధిలేదు? జగ్గ మంచివాడయితే ఇక ఆ ఇంట్లో అందరూ మంచివాళ్ళనే లెఖ్ఖ? ఆ గయ్యాళిదాని నోరు పెళ్లినాడే చూశాను” అంది అత్త.

ఈ మాటలు దుర్గకి ఏమీ ఉపశాంతిని కలిగించలేదు. కాగా ఇంకా వెక్కి వెక్కి ఏడవటానికి ఉపయోగపడ్డాయి.

“మొగుడు నావగానే, దాన్ని నోరెత్తితే పచ్చడిచేసే వాడికిచ్చి మళ్ళా పెళ్ళి చేసెయ్యావలసింది. దానికి మొగుడంటూ లేకపోవడంవల్ల ఆ కసిని మరదలిని సాధించడంలోను, ఇల్లంతనీ దాని మాటమీద నడిపించడంలోను తీర్చుకొంటోంది” అన్నాడు భర్త. అది వేళాకోళంగానే అన్నా, దానిలోని తీవ్రతని, సూక్ష్మత్వాన్ని ఎవరూ గ్రహించలేకపోయారు.

దుర్గ ఏడుపింకా తగ్గలేదు. అత్తమామలు ఆమెను బతిమాలి లోపలికి తీసుకవచ్చి మంచంమీద వేశారు. హఠాత్తుగా విన్న ఈ కబురుతో గర్భంలోవున్న ఐదునెల్ల పిండానికి ప్రమాదం కలుగుతుందని వాళ్లు ఆమెని ఎన్నో విధాల ఊరడించడానికి ప్రయత్నించారు.

కాని ఆమె కన్నీరింకా తగ్గటంలేదు. ఆమె ఎనిమిదేళ్ళ ప్రాయంలో వున్నప్పుడు తలితండ్రులిద్దరూ పోయారు. అప్పటినించి ఏడేళ్ళు పెంచి అన్నయ్యే ఆమెకి పెళ్లిచేశాడు. చిన్న చెల్లెలికి గూడ క్రితం ఏడాది, ఉన్నదాన్లోనే ఘనంగా వివాహం చేశాడు. అది సంతోషంగా కాపురానికి వెడుతూంటే ఎంతో ఆనందంగా దాన్ని ముద్దులాడాడు. ఈవాళ వాడే దాని పుస్తెని చేచేతులా తెంపేశాడా? ఇక ఆ చర్యని చూడలేక వాడూ ఆత్మహత్య చేసుకున్నాడా?

తలచుకొని, తలచుకొని దుర్గ ముఖాన్ని చేతుల్లో పెట్టుకొని కుమిలి కుమిలి ఏడుస్తోంది. సాయంకాలం గూడ అయిపోయింది. దుర్గ

భర్త ఆ గ్రామానికి మనిషిని పంపించాడు. అసలు సంగతేమిటో కనుక్కురమ్మని. కాని దుర్గ వేసిన మంచంమీంచే లేవడంలేదు.

"కాస్త పాలన్నా తాగమ్మా. అన్నయ్య అంతపని చెయ్యడు. వాడు తప్పకండా తిరిగి వస్తాడు" అని అత్త మామ లెంత ధైర్యం చెబుతున్నా దుర్గ స్థిమితపడడం లేదు.

చీకటిగూడ పడిపోయింది. దుర్గ పచ్చి మంచి నీళ్ళైనా ముట్టలేదు. మాటగూడ ఆడటంలేదు. భర్తవస్తే అతనికేసి జాలిగాచూస్తూ ఏడుస్తుంది. అత్తమామ లూరడిస్తే ఇంకా భోరుమంటోంది.

అత్త విసనకర్ర పట్టుకొని దుర్గకి విసురుతోంది. దుర్గ కళ్లు మూసుకొన్నా నీళ్లుమాత్రం రెప్పల కిందినించి వెల్లువలవుతున్నాయి. కబురు ఇంకా ఏమీ రాలేదు. కాలం గడుస్తున్న కొద్దీ అత్త ముఖంలో భయం మెదులుతోంది. బయట మామ కూచొని వున్నాడు. భర్త లోపలినించి బయటకి, బయటనించి లోపలికి మెల్లగా తిరుగుతున్నాడు.

రాత్రి సరిగా పదకొం డవుతుందనగా బయట సన్నగా కేక వినిపించింది. మామ బయటికి తొంగి చూశాడు. "ఎవరు...!" అని గభుక్కున ఆ ఆగంతకుణ్ణి పట్టుకొని లోపలికి తీసుకవచ్చాడు.

మంచంమీద పెద్ద చెల్లెలు పడుకొని వుండడం, అత్త విసురుతుండడం, ఆ ఇంట్లో ఇంకా అందరూ మెలుకవగా వుండడం మనుకి ఆశ్చర్యం వేసి, చెల్లెలి మంచంమీద మెల్లగా కూచున్నాడు మను.

మను రాగానే అత్త ముఖం కలకల్లాడింది. దుర్గ భర్త మనుని పలకరించబోయాడు గాని తల్లి వారించడంతో ఊరుకొన్నాడు. అందరూ దుర్గనే చూస్తున్నారు.

"చెల్లీ" అని మెల్లగా దుర్గ ముఖంమీదికి వంగి పిలిచాడు మను.

దుర్గ కళ్లు విప్పలేదు. కనురెప్పల కింద మాత్రం కన్నీరు నిండివుంది.

"అమ్మా" అని మెల్లగా చెలెలి చెక్కిళ్ళని స్పృశించాడు.

దుర్గ బరువుగా కళ్లు విప్పింది. కనుపాపల మీద కన్నీరు దట్టంగా వుండి దృష్టి దుర్గకి సరిగా ఆనలేదు. కళ్ళముందు అగుపిస్తున్న అస్పష్ట ముఖాన్ని భర్త అనుకొని "వచ్చాడా? మా మను అన్నయ్య-చెప్పరేం? తెలీదు?" అని మను భుజాలు పట్టుకొని వూపింది.

"నేనే... నేనే చెల్లి, మను అన్నయ్యని" అన్నాడు, చెల్లెలు తలని రెండు చేతులతో పట్టుకొని. కనురెప్పల్ని టపటప లాడించింది. అంతః పటలంమీద అన్నయ్య ఛాయ స్పష్టంగా అగుపించింది.

"అన్నయ్యా" అని వెర్రిగా కేకేసి గభుక్కున మనుని కౌగలించుకొంది. ఛాతీమీద ముఖంపెట్టి పరవశ స్వరంతో "అన్నయ్యా, నువ్వు... నువ్వు... చచ్చిపోలేదు? అన్నయ్యా" అని మను తలని, ముఖాన్ని భుజాలని, ఛాతీని తడుముతోంది.

"ఛా! ఎవరన్నారు? నేనా చచ్చిపోయేది? ఉహుఁ మీ యిద్దరున్నంత కాలం నాకు చావే? మిమ్మల్ని అన్నాలు పెట్టకండా కడుపులు మాడిస్తే, నేను వాళ్ళ పీకలు నులిమేయడానికి మీ వెనకనే వుంటాను."

"మరి మరి జగ్గని చంపలేదు?"

"...ఉహుఁ వాణ్ణెందుకు? వాడికి జ్ఞాపకముండేలా తలమీద ఒక గంటుపెట్టాను" అని లాలనగా చెల్లి తలని ముద్దుపెట్టుకొన్నాడు.

"చెల్లి పద్మని అది ఎన్నెన్ని కష్టాలు పెట్టేదనుకొన్నావ్? మొదట్లో చిన్న చెల్లెల్ని చూడగానే ఆ ఇంట్లో పనిచేసే దాసీ దనుకొన్నాను. నేను గుండెలమీద ఎక్కించుకొని దాని పాలబుగ్గల్ని కొరికేవాడిని, అవన్నీ తీసిపోయాయి. దాని వొళ్ళంతా దెబ్బలతో కంది, రక్తాలు గూడుకట్టేశాయి. నన్ను చూడగానే బెగిలిపోయి నన్ను గట్టిగా పట్టుకొని "ఇక అక్కడొక నిముషమైనా ఉండ"నని ఏడ్చేసింది.

"అది నా దగ్గరకొస్తే ఏముంది? దానికి నే నేమివ్వగలను? జగ్గ ఆ ముండ మాటలు విని చెల్లెని చావబాదేవాడట. ఆ ముండే అక్కడ పెద్ద అధికారిణి. నన్నుగూడ అందరిలాగే కొట్టడానికి మీదికొచ్చింది. దాన్ని, ఆ ముండని పీక నరికేయవలసిందే. కాని అది అలా ఒక్కసారి చావగూడదు-ఏం చేశానో తెలుసా?

రెండు కళ్ళూ పీకేసి, నాలిక కోసేశాను. ఇక నించి అది చెల్లెలిని ఏమీ అనలేదు.

కత్తి చూడగానే జగ్గ గడగడ లాడిపోయాడు చెల్లీ" అని పకపక నవ్వాడు మను.

"అన్నయ్యా" అని దుర్గ నిట్టూర్పు విడిస్తూ మనుమీద వాలిపోయింది.

మను అప్యాయంగా చెల్లెలి తల నిమిరి ముద్దుపెట్టుకొన్నాడు.

"చెల్లీ! మిమ్మల్ని నేనెంత ప్రేమిస్తేనేమి, ఆ గయ్యాళిదాని గుడ్లు పీకినందుకు పోలీసులు నను జైల్లో పెడతారు. అయినా మీ అన్నయ్య ప్రేమని ఆ ఇనుప గజాలుగూడ బంధించలేవు. ఎండకి తెల్లని గొడుగులా, మిమల్ని నా ప్రాణం వున్నంతవరకూ, నేనెక్కడ ఎన్ని చెరసాలల్లో వున్నా కాపాడుతూనే వుంటాను" అని చెల్లెలి ముద్దు ముఖాన్ని ముద్దులాడాడు చెల్లెలు రెండేళ్ళ పసిపాప అనే ఉద్యేశ్యంతోనే.

కథానిక

# లెక్కలొచ్చిన మొద్దబ్బాయి

"సుబ్బన్న"

ఏరికోరి పెట్టిన పేరు హనుమంతరావుకు తగినట్టుగానే ఉంది. వాడు చేసే పనులే గాకుండా ఆకారంకూడా అందుకు తగినట్టే అమిరింది.

వాడి అల్లరిమూలంగా నైతేనేం, సమాజంలో వాడి తండ్రికున్న గౌరవంచేత నైతేనేం, వాడి తాత సంపాదించిన ఆస్తి కారణంగా నైతేనేం, హనుమంతరావు చదువకపోయినా ప్రతి క్లాసు ప్యాసవుతూనే ఉన్నాడు.

ఆ రోజున క్రొత్తగావచ్చిన లెక్కలమేష్టరు వాళ్ళ క్లాసుకొస్తారని హనుమంతరావుకు ముందుగానే తెలిసింది. మేష్టారు క్లాసులోకి వెళ్ళేసరికి వాడో చిన్న ఉపన్యాసం ఇస్తున్నాడు. మేష్టార్ని చూచి బుర్ర గోక్కుంటూ స్వాగతమిచ్చాడు.

'మీ ఊరు, పేరు, రూపు, రంగూ అన్నీ చెప్పేశానండి. మీరిక పాఠం మొదలెట్టవచ్చు.' అనుజ్ఞ ఇచ్చి మొదటి బెంచీ డస్కుమీద కోతిలాగ కూర్చున్నాడు:

పిల్లలంతా నవ్వుతున్నారు.

'అడ్డం లేవోయ్' కేక వేశారు.

'అదేం కూర్చోడం?' మందలించారు.

'మాడండి మేష్టారూ!' ఫిర్యాదుచేశారు.

'ఇటు రావోయ్' ఆహ్వానించారు.

కొత్త మేష్టారు వీటి నేమీ పట్టించుకోకుండా నల్లబల్ల తుడిచి, వారిపేరు, ఊరు, వారు చెప్పే విషయాలు వరుసగా వ్రాశారు.

'అవన్నీ నే చెప్పేశానండీ' అన్నాడు హనుమంతరావు.

మళ్ళీ క్లాసులో కలకలం బయలుదేరింది.

మేష్టారు బల్లమీద పెద్దపెద్ద అక్షరాలతో ఏదో వ్రాస్తున్నారు.

కొత్త మేష్టారు జంకులేకుండా నిలబడటం, ఎంత గోల చేసినా లక్ష్యం చెయ్యకుండా ఏదో వ్రాయడం, వాళ్ళు కల్పించినా క్రమశిక్షణమీద చిన్న ఉపన్యాసమైనా దంచకపోవడం-ఇవన్నీ పిల్లలకు క్రొత్తగా ఉన్నాయి. వింతగా ఉంది. నిశ్శబ్దంగా కూర్చున్నారు. మేష్టారు క్లాసును ఒక్కసారి కలియ జూశారు.

హనుమంతరావు నిలబడి 'మొద్దబ్బాయి కూడ లెక్కలు నేర్చుకోగలడు' బోర్డుమీది వ్రాతను బిగ్గరగా చదివాడు.

'అంటే నీక్కూడా లెక్కలు వస్తాయన్న మాట' వ్యాఖ్యానించాడు శ్రీహరి. అంతా విరగబడి నవ్వేశారు. కొందరు బల్లలు చరిచారు. హనుమంతరావుకు కోపం రాలేదు.